క్లుప్తంగా

నాంచారమ్మ హుండీ ఆదాయం రూ.7.67లక్షలు

కోడూరు: కృష్ణాతీరంలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ తల్లి హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారులు బుధవారం లెక్కించారు. ఆరు నెలలకుగానూ మూడు హుండీల ద్వారా రూ.7,67,906ల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారి యు.జయశ్రీ తెలిపారు. తనిఖీ అధికారి ఎస్.అరుణ, జేఏ సీహెచ్ శివప్రసాద్, గ్రామ ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్ ప్రారంభం



పెడన: పట్టణంలోని 8వ వార్డు జోగానందరావు కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దూర ప్రాంతం నుంచి ఆటలు ఆడేందుకు, పరీక్షలు రాసేందుకు, ప్రాజెక్ట్ వర్క్, శిక్షణ కోసం పెడన కేంద్రానికి విచ్చేసే వారికి సీజన్ హాస్టల్ ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు, హాస్టల్ కోఆర్డినేటర్ రవి, పాఠశాల హెచ్ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు, ఏఎంసీ చైర్మన్ నాగ శ్యామల పాల్గొన్నారు.

రామన్నపేటలో వైద్య శిబిరం

గూడూరు: స్వస్థ్ నారీ - స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని రామన్నపేటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రూపా శ్రీ బృందం రోగులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. త్రీమెన్ కమిటీ చైర్మన్ మురాల ధనుష్ పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే

గూడూరు: మండలంలోని తుమ్మలపాలెంలో బుధవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా విషజ్వరాల వ్యాప్తికి కారణమయ్యే దోమలను అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మౌనిక, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ - స్వశక్త్ పరివార్ ర్యాలీ



కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో బుధవారం స్వస్థ్ నారీ - స్వశక్త్ పరివార్ అభియాన్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ చలపాటి రాణి, ఉపసర్పంచ్ గుత్తికొండ తుమ్మల శంకరరావు, పంచాయతీ కార్యదర్శి నాగమణి, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తాం..



మోపిదేవి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని నూతన చైర్మన్ పరచూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని మోపిదేవి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహాజన సభ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకులో లాకర్స్ సౌకర్యం వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. తమ బ్యాంకులో రూ. 92 లక్షలు డిపాజిట్ రూపంలో ఉన్నాయని, మొత్తంగా రూ. 8 కోట్లపైగా టర్నోవర్ జరుగుతున్నట్లు తెలిపారు. ఎరువులు కావాల్సిన వారికి తప్పనిసరిగా ఈ పాస్ ద్వారానే అందించడం జరుతుందన్నారు. గత ప్రభుత్వంలో గోడౌన్ నిర్మించారని, దానికి దారి సౌకర్యం కల్పించి సొసైటీకి అప్పగించాలని తహసీల్దార్ ఎం.హరనాథ్‌ను కోరారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, ఏఓ హెప్సిబారాణి, ఎంపీటీసీ సభ్యుడు పవన్‌కుమార్, సొసైటీ డైరెక్టర్లు కారుమూరి ప్రసాద్, కొలుసు శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మచిలీపట్నంఅర్బన్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని స్థానిక భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఉద్యోగులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో వారు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. బీఈఎల్ ఉద్యోగులు, సిబ్బంది సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలను శుభ్రపరిచి, బ్లీచింగ్ చేశారు.



అన్నపూర్ణాదేవిగా విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ



అన్నపూర్ణాదేవిగా కోడూరు గంగాభవానీ అమ్మవారు



చల్లపల్లిలో అమ్మవారు



పెదతుమ్మిడిలో గాయత్రీదేవీ అలంకారం



గూడూరులో గాయత్రీ దేవి అమ్మవారు

ఆదిపరాశక్తీ.. మాతా అన్నపూర్ణేశ్వరీ

కోడూరు: అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. కోడూరులో వేంచేసియున్న గంగాభవానీ అమ్మవారి ఆలయంలో మూడవ రోజు బుధవారం మూలమూర్తిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంత మార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గమ్మకు విశేష అలంకారం చేసి, నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. విశ్వనాథపల్లి, మందపాకల అద్దంకి నాంచారమ్మవార్లు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. కోడూరు దానాశక్తి, పార్వతీదేవి, లింగారెడ్డిపాలెం బాలా త్రిపుర సుందరీదేవి, నరసింహపురంలో కనకదుర్గమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక కుంకుమపూజలు

బంటుమిల్లి: స్థానిక కనకదుర్గనగర్‌లో శ్రీకనకదుర్గ ఆలయం, పాశ్చాపురం శ్రీసువర్చలాంజనేయ స్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణగా, పెదతుమ్మిడి శివాలయంలో అమ్మవారు గాయత్రిదేవీగా పూజలు అందుకున్నారు. అలాగే స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి, పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీసంతానలక్ష్మీగా, గజలక్ష్మీ, మల్లేశ్వరం కోదండరామాలయంలో ధాన్యలక్ష్మీగా అలంకరించి సామూహిక కుంకుమ పూజలు చేశారు.

గాయత్రీదేవిగా అమ్మవారు

గూడూరు: గూడూరులోని గంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. తరకటూరులోని అన్నపూర్ణాదేవిగా, మల్లవోలులోని పార్వతీ సమేత చిన్నమహేశ్వరస్వామి ఆలయంలో శ్రీగాయత్రీదేవిగా అమ్మవారు పూజలందుకున్నారు.

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ తల్లి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలోని శ్రీదుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అన్నపూర్ణాదేవిగా దుర్గాదేవిని అలంకరించారు. కొక్కిలిగడ్డ శ్రీ గంగా భ్రమరాంబ అమ్మవారు, మోపిదేవి శ్రీ సకలేశ్వరస్వామి ఆలయం, కె.కొత్తపాలెంలో దుర్గా కోటేశ్వరస్వామి ఆలయంలోనూ దుర్గామాత అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కృత్తివెన్ను: నీలిపూడి, అడ్డపర్ర గ్రామాల్లో అమ్మవారు మాతా అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కృత్తివెన్ను శివాలయంలో గాయత్రీదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు.

పెడన: ఉరివి గ్రామంలోని శ్రీగంగా పార్వతీ సమేత సోమేశ్వర ఆలయంలో బుధవారం అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. పెడన పట్టణంలో పైడమ్మ తల్లి, కన్యకాపరమేశ్వరి శ్రీఅన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు.

అవనిగడ్డ: మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం అన్నపూర్ణ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక రాజశేఖరస్వామి ఆలయం, లంకమ్మ తల్లి ఆలయం, పులిగడ్డ, వేకనూరు కనకదుర్గ ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు.

కనులపండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కృత్తివెన్ను శివాలయంలో..

మచిలీపట్నంలో...

మచిలీపట్నంటౌన్: ఆజాద్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో బుధవారం అమ్మవారు గజలక్ష్మీదేవిగా, పార్వతీదేవి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు గాయత్రీదేవిగా, ఈడేపల్లిలోని శక్తిగుడిలో కాళికాదేవిగా, రాజుపేటలోని భ్రమరాంబ సమేత రాజమౌళేశ్వరస్వామి ముచ్చం గుడిలో గాయత్రీదేవిగా, రేవతి సెంటర్లో గంగానమ్మ తల్లి అన్నపూర్ణగా దర్శనమిచ్చారు.

మచిలీపట్నంటౌన్: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీపర్వతవర్ధిని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, ఈడేపల్లి శక్తి గుడి, ఆజాద్ రోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం, బుట్టాయిపేటలోని దత్తాశ్రమం, రేవతి థియేటర్ సెంటర్లోని గంగానమ్మ ఆలయం, భాస్కరపురంలోని త్రిశక్తి పీఠం, ప్రధాన రహదారి, ఓగీస్‌పేటల్లోని కనకదుర్గమ్మ ఆలయాలు రంగురంగుల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

చల్లపల్లి: మండలంలోని నడకుదురు శ్రీపృధ్వీశ్వర స్వామి ఆలయంలో బాలా త్రిపుర సుందరీ మాత బుధవారం అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అలాగే చల్లపల్లిలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు.



బందరు ఈడేపల్లి శక్తిగుడిలో కాళికాదేవిగా



అవనిగడ్డలో కాశీ అన్నపూర్ణాదేవి అలంకారం



కొక్కిలిగడ్డలో అన్నపూర్ణేశ్వరిగా భ్రమరాంబ



కె.కొత్తపాలెంలో అన్నపూర్ణాదేవిగా దుర్గాదేవి



పెడన మండలం ఉరివిలో అమ్మవారు

వైభవంగా అన్నపూర్ణ సహిత నవగ్రహ హోమం

నాగాయలంక: స్థానిక ప్రసిద్ధ శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అన్నపూర్ణ సహిత నవగ్రహ హోమం వైభవంగా నిర్వహించారు. పార్వతీదేవి, వాసవీ కన్యాకాపరమేశ్వరీలు అన్నపూర్ణాదేవి, గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అలాగే కృష్ణానది తీరంలోని శ్రీరామపాదక్షేత్రంలో కనకదుర్గమ్మవారు అన్నపూర్ణమ్మగా పూజలందుకున్నారు. గణపేశ్వరంలోని శ్రీదుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాల్లో దుర్గమ్మ శ్రీగాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భావదేవరపల్లిలో శ్రీఅన్నపూర్ణ దేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి అలంకార దాతలుగా బండ్రెడ్డి నీలాంబరరావు, అరుణకుమారి పూజలు జరిపారు.



శ్రీరామపాదక్షేత్రంలో అమ్మవారికి హారతులు





గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), మాజీ ఎమ్మెల్యేలు సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్ కుమార్, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పేర్ని కిట్టు, ఉప్పాల రాము తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్ వర్క్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- మండలంలో పేర్ని పర్యటన
- పలు కుటుంబాలకు పరామర్శలు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ కుటుంబాలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎవరూ అధైర్యపడొద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తల కుటుంబాలతో పాటు ఇటీవల అకాల మరణం చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. తొలుత వాడపాలెం చేరుకున్న పేర్ని వైఎస్సార్ సీపీ సౌత్ మండల సోషల్ మీడియా కన్వీనర్ రెడ్రౌతు చందు తండ్రి వీరబాబు మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వీరబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. అక్కడి నుంచి బయలుదేరి ఇటీవల ఎస్.గొల్లపాలెంలో జడ్డు శ్రీనివాసరావు తల్లి మరణించగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం సింహాచలం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త పుట్టి శాంతిప్రేమ గుండెపోటుతో మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను కలిశారు. ఈ పర్యటనలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొర్రా విఠల్, మాజీ జెడ్పీటీసీ లంకే వెంకటేశ్వరరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ గణేశన రమేష్, సౌత్ మండల అధ్యక్షుడు జన్ను రాఘవరావు, నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహన నాంచారయ్య, మండల ఉపాధ్యక్షుడు అర్జా రమణ, నార్త్ మండల ఉపాధ్యక్షుడు మందా బాబురావు, వాడపాలెం సర్పంచ్ మేడిశెట్టి రాజ, నాయకులు జడ్డు గోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వాడపాలెంలో చందు కుటుంబాన్ని పరామర్శిస్తున్న పేర్ని నాని

చిట్టిబాబుకు పరామర్శ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 31వ డివిజన్ కళ్యాణ్ నగర్‌కు చెందిన పరుచూరి పెదబాబు ఇటీవల మృతిచెందడంతో ఆయన సోదరుడు చిట్టిబాబును పేర్ని నాని పరామర్శించారు. పేర్ని నానితో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కార్పొరేటర్ యంద్రపాటి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, శివగంగ పీఏసీఎస్ మాజీ చైర్మన్ కోసూరి మునలయ్య, అనిల్‌బాబు ఉన్నారు.

విద్యార్థులకు సేవా భావం ఉండాలి

బంటుమిల్లి: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని విశ్రాంత ఆర్‌ఐఓ మట్టా రాధాకృష్ణమూర్తి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్.జగన్‌మోహన్‌రావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ, మదర్ థెరిస్సా లాంటి ఎంతో మందిని ఆదర్శంగా తీసుకొని సేవలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా కాలేజీలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టరు జీబీ ఆనందకుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ బీడీ జయరాజు, ఐక్యూ కోఆర్డినేటర్ ఆర్ హిమాలినీదేవీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ

మచిలీపట్నంఅర్బన్: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో అందరూ భాగస్వాములు కావాలని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మి అన్నారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ చేశారు. ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాథ్ బాబు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మమత, హిరణ్మయి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పొలాల్లోకి చొచ్చుకొచ్చిన వరద నీరు



చల్లపల్లి: కృష్ణానదిలో పెరిగిన వరద నీటి కారణంగా కరకట్ట దిగువన ఉన్న మెట్ట పొలాలు కొంతమేర ముంపునకు గురయ్యాయి. నదిలోని నీరు పంట పొలాల్లోకి చొచ్చుకు వచ్చింది. బుధవారం ప్రకాశం బ్యారేజి వద్ద 4.5లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో నదిలో నీటి మట్టం పెరిగితే మరిన్ని పొలాలు నీట మునిగే ప్రమాదం ఉంది. లంకల్లోకి రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు.

ఆక్వా విద్యుత్ సబ్సిడీకి రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నాలి(నాగాయలంక): ఆక్వా రైతులు విద్యుత్ సబ్సిడీకి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభ తెలిపారు. మండలంలోని నాలి గ్రామంలో బుధవారం ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాగాయలంక మండలంలో దాదాపు 11,393 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుంటే కేవలం 385.52 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయని పేర్కొన్నారు. ఆక్వా రైతులు విద్యుత్ యూనిట్‌కు రూ.1.50 చొప్పున సబ్సిడీ పొందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని చెప్పారు. గ్రామ మత్స్య సహాయకులను సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలు అందించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె వివరించారు.

యూరియా కొరతపై నిలదీత

అవనిగడ్డ: యూరియా కొరత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పూర్తిస్థాయిలో సరఫరా చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో తెలపాలని పలువురు ప్రజాప్రతినిధులు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీశారు. బుధవారం ఎంపీపీ తుంగల సుమతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రజల ఆరోగ్యంపై సర్వే నిర్వహించాలని ప్రజాప్రతినిధులు కోరారు. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని, నీటిని క్లోరినేషన్ చేయించడంతోపాటు 15 రోజులకు ఒకసారి అయినా ఫాగింగ్ చేయాలన్నారు. దోమల నివారణకు దోమల మందు పిచికారి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శుభహారిక మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా యూరియా సమస్య ఉందని అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు మండల అభివృద్ధిలో సహకారం అందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో మరియా దేవి, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పలువురు ఎంపీటీసీలు, సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుమతి దేవి

నవభారత నిర్మాణంతోనే గ్రామీణ ప్రగతి



పెడన: నవ భారత నిర్మాణంతోనే గ్రామీణ ప్రాంతాలు ప్రగతి సాధిస్తాయని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీలే ప్రగతికి ప్రణాళికలు అన్న అంశంపై సర్పంచులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఎ.అరుణకుమారి మాట్లాడుతూ పంచాయతీలు పూర్తి స్థాయిలో ప్రగతి సాధించడానికి ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను విడుదల చేస్తోందన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని పంచాయతీలు పురోభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా ఈ సదస్సుకు పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో 70 మంది సర్పంచులకుగానూ కేవలం పది మంది మాత్రమే హాజరుకావడం విశేషం.